క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



సూర్యనమస్కారం చేస్తున్న జగదీశ్వర శర్మ

కొత్తూరు: మండల కేంద్రంలోని సీతారామాలయ 7వ వార్షికోత్సవం గురువారం ప్రారంభమైంది. గ్రామ పురోహితులు గుడిమెట్ల సురేష్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు రంప జగదీశ్వర శర్మ సూర్యనమస్కారాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని తిరువీధి చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎల్.తులసీవరప్రసాదరావు, ఉపాధ్యక్షుడు తాత బాబు, లోతుగెడ్డ జనార్దనరావు, టీటీడీ ఆధ్యాత్మిక మండలి మండల కమిటీ అధ్యక్షుడు పాగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

అభినందన



విద్యార్థి, ఉపాధ్యాయులను అభినందిస్తున్న రామరాజు

సారవకోట: మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని మాసవరపు మధుశ్రీకి, ఉపాధ్యాయులకు పాతపట్నం రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు నక్క రామరాజు గురువారం అభినందించారు. మాధుశ్రీకి జిల్లాలో నాల్గొవ స్థానం రావడం గర్వించదగ్గ విషయమని ఎంఈఓ రమణ అన్నారు. హెచ్ఎం మాధవరావు, ఎంఈఓ-2 భూలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో మేలు



విత్తనాలను శుద్ధి చేస్తున్న రైతులు

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బీజామృతంతో వరి విత్తనాలను శుద్ధి చేయడం వల్ల పలు రకాల తెగుళ్లు రాకుండా నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కుంటిభద్ర గ్రామంలో గురువారం విత్తన శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల మొలక శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. పలు రకాల చీడ పురుగులు ఆశించవన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యాంత్రీకరణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెడ్డిస్ ఏరియా మేనేజర్ తవిటినాయుడు

సారవకోట: రెడ్డిస్ ఫౌండేషన్ ద్వారా పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామని ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. మండలంలోని వడ్డినవలసలో ఇప్పిలి రామ్మోహనరావు పొలంలో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రంతో విత్తనాలు వేసే కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రాన్ని అందిస్తూ విత్తనాలు, ఎరువులు ఒకేసారి వేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

వరి విత్తనాల సరఫరా



విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మణెమ్మ

పొందూరు: ప్రభుత్వం రాయితీపై అందజేసే వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాడివలస సర్పంచ్ తమ్మినేని మణెమ్మ అన్నారు. మండలంలోని తాడివలసలో గురువారం వరి విత్తనాలను పంపిణీ చేశారు. సచివాలయం సిబ్బంది, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పొలం పనుల్లో బిజీ..బిజీ



తిమడాంలో వరి వెద వేస్తున్న రైతు

బూర్జ: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి వెదలు వేస్తున్నారు. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. విత్తనాలు వేయడానికి పదును బాగుండటంతో గురువారం వెదలు జల్లడం ప్రారంభించారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



నరసన్నపేట: మాట్లాడుతున్న తహసీల్దార్ కనకారావు



జలుమూరు: త్యాగరాజును సన్మానిస్తున్న తహసీల్దార్ నాగమ్మ, సిబ్బంది

- రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం
- ఉత్తమ సేవలకు ప్రశంస

నరసన్నపేట: ప్రజలందరితో మమేకమయ్యేది రెవెన్యూ శాఖ అని నరసన్నపేట తహసీల్దార్ కనకారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ 'డే' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర శాఖలతో పోల్చితే రెవెన్యూతోనే ప్రజలకు ఎక్కువ సంబంధాలు ఉంటాయన్నారు. బ్రిటిష్ కాలం నుంచి రెవెన్యూకు మంచిపేరు ఉందని గుర్తుచేశారు. సర్వేయర్ అప్పలస్వామి, డీటీ రామారావు మాట్లాడుతూ రెవెన్యూశాఖ ప్రజలకు ఎలా ఉపకరిస్తుందనేది వివరించారు. సర్వే, భూ రికార్డుల గురించి వివరించారు. పారశిల్లి ఎంపీటీసీ పంగ శ్రీరాములు మాట్లాడుతూ రెవెన్యూ సేవలను అభినందించారు. కోవిడ్ సమయంలో చేసిన సేవలు అమోఘమన్నారు. 35 ఏళ్ల రెవెన్యూలో వివిధ హోదాల్లో పనిచేస్తూ సేవలు అందించిన తహసీల్దార్ కనకారావును, విశ్రాంత వీఆర్వో కింజరాపు మోహన్‌రావును సిబ్బంది ఘనంగా సత్కరించారు. డీటీలు గాయిత్రి, శరత్, ఆర్ఐ లోకేష్‌లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పాతపట్నం: మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదరావు



బూర్జ: మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేడ్కర్

బూర్జలో..

బూర్జ: రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందించే సేవలపై తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్ అవగాహన కల్పించారు. తహసీల్దారు కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. డీటీ సంతోష్ కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, ఆనెపు రామకృష్ణ నాయుడు, సర్పంచ్ ఏగు అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వై.వి.వి.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ కీలకమైందన్నారు. ఇకపై పాత పద్ధతిలోనే వన్-బీ, ఇతర సేవలు అందుతాయన్నారు. విశ్రాంత వీఆర్వోలు శేషగిరి, లక్ష్మీనారాయణను సన్మానించారు. డీటీలు వెంకటరమణ, సునిల్ కుమార్, మండల సర్వేయర్ రామగణపతి, సినియర్ అసిస్టెంట్ జగన్మోహన్‌రావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జలుమూరులో..

జలుమూరు: రెవెన్యూ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ నాగమ్మ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. రెవెన్యూ పరిశీలకునిగా సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన రావాడ త్యాగరాజును సన్మానించారు. డీటీ శ్రీనివాసరావు, సర్వే డీటీ తిరుపతిరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉండండి

నరసన్నపేట: రైతులకు అన్ని విధాలా అండగా నిలవాలని, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా వ్యవసాయ శాఖ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మాకివలస ఆర్‌బీకే వద్ద రైతులకు వరి విత్తనాలు, ఎరువులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ విధంగా రైతులకు సహకారం అందించినా మేలేనన్నారు. గ్రామాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. మితిమీరి ఎరువులు, క్రిమి సంహారిక మందులు రైతులు వాడకుండా అవగాహన కల్పించాలన్నారు. ఒక రైతుగా రైతు కష్టం తనకు తెలుసన్నారు. ఏడీ రవీంద్రభారతి, వ్యవసాయాధికారి కె.సునీత మాట్లాడుతూ విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకుని డబ్బు చెల్లించిన రైతులకు విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎరువులు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఎంపీటీసీ యాళ్ల అప్పలనాయుడు, సర్పంచ్ మోహన్‌రావు, టీడీపీ నాయకులు బైరి భాస్కరరావు, శిమ్మ చంద్రశేఖర్, యాళ్ల వేణుగోపాలరావు, బోడి రామన్న తదితరులు పాల్గొన్నారు.



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన

బూర్జ: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోకపోవడం వల్లే రక్తహీనతకు గురవుతారని స్థానిక వెలుగు ఏపీఎం పి.బాబూరావు అన్నారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా ఏపీపేట పంచాయతీ గోపిదేవిపేటలో గురువారం అవగాహన కల్పించారు. బూర్జ పీహెచ్‌సీ సీహెచ్ఓ కె.అప్పలస్వామి మాట్లాడుతూ.. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా వచ్చే అంటు వ్యాధులు, గర్భాధారణ సమయంలో సమస్యలు ఉంటాయన్నారు. ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు టి.తేజారావు, లఖినాన సరోజిని, ఎంఎల్‌హెచ్‌పీ జి.లక్ష్మి, ఏఎన్ఎం పి.ఆమని, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.సుజాత, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వెలుగు, వైద్య సిబ్బంది

జీవన యోగం



మెళియాపుట్టి: వేతనదారులతో యోగా చేయిస్తున్న అధికారులు



సరుబుజ్జిలి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: యోగా దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకొంటే మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలో యోగా కార్యక్రమంపై అవగాహన ర్యాలీలు, సదస్సులు గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ మేనక రత్నం, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు పూజారి పురుషోత్తమరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..

హిరమండలం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంఈఓ కె.రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న (ఓం శాంతి) విశ్వ కళాభవన్‌లో ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మెళియాపుట్టి: మండలంలోని పడ్డ గ్రామంలోని ముకుంద సాగరంలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల వద్ద గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని వేతనదారులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఉపాధి సబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ



నరసన్నపేట: పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అసిరినాయుడు



సరుబుజ్జిలి: కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

సరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్లును సర్పంచ్ సువరపు జగదీశ్వరరావు, షళంత్రి ఎంపీటీసీ సభ్యుడు శివ్వాల సూర్యనారాయణ గురువారం పంపిణీ చేశారు. ఎంఈఓలు శ్రీనివాసరావు, బాలరాజు, సీఆర్ఎంటీ చిరంజీవి, టీడీపీ నాయకుడు అంబళ్ల రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దూకులపాడులో..

నరసన్నపేట: మండలం దూకులపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో 80 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లును సర్పంచ్ అసిరినాయుడు గురువారం పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులు అందజేశారు. ఉపాధ్యాయులు పట్నాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని కేకే రాజపురం జెడ్పీ హైస్కూల్, గుత్తావల్లి జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు టీడీపీ నాయకుడు ఆనెపు రామకృష్ణ నాయుడు పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, స్టూడెంట్ కిట్లు హెచ్ఎం టి.కేశవరావు ఆధ్వర్యంలో నాయకులు లాడి శ్రీకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు తట్ల శంకర్ అందజేశారు. నాయకులు ఎందవ తవిటయ్య, గొర్లె సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వ్యవసాయాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయం, అనుబంధ శాఖలైన హార్టికల్చర్, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, కో-ఆపరేటివ్, ఏపీఎంఐపీ, వంశధార తదితర శాఖలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,82,325 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇందులో వరి 1,61,500 హెక్టార్లు, మొక్క జొన్న 14000 హెక్టార్లు సాగవుతుందని తెలిపారు. 31699 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, అందులో 16,904 క్వింటాళ్ల పంపిణీ పూర్తయిందని చెప్పారు. 1,18,820 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు కేటాయించగా 33,000 మెట్రిక్ టన్నులు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. గత ఏడాది జిల్లాలో రూ. 8029 కోట్ల పంట రుణాలు అందజేయగా ఈ ఏడాది కూడా అర్హులైన రైతులందరికీ పంట రుణాలు మంజూరు చేసి బ్యాంకర్లు సహకరించాలన్నారు. పి. ఎం. కిసాన్ కింద జిల్లాలో 2.29 లక్షల మంది రైతులకి రూ.45.8 కోట్లు ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత పనుల వివరాలు, నీటి నిల్వ, ట్రిబ్యునల్ కేసుల ప్రస్తుత స్థితి గురించి సంబంధిత శాఖాధికారులు వివరించారు. మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టులలో ప్రస్తుత నీటిని నిలవ స్థితిని ఖరీఫ్ 2024-25 కార్యాచరణపై చర్చించారు. పశుసంవర్ధక శాఖపై సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలావరకు పాడి రైతులు ఉన్నారని, పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఉద్యానవన శాఖ లక్ష్యాలు, ప్రగతిపై నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వ్యవసాయాధికారి కే.శ్రీధర్, పశుసంవర్ధక శాఖ జేడీ జయరాజు, వంశధార ఎస్ఈ రాంబాబు, నీటి పారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్‌రావు, మత్స్య శాఖ డీడీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం రమణి, సెరికల్చర్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్‌బాబు, ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.వి.ప్రసాద్, మార్కెటింగ్ ఏడీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

నరసన్నపేట: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, దీనికి చిన్మయి మిషన్ ప్రయత్నాలు చేస్తుందని స్వామి పరమాత్మానంద సరస్వతి అన్నారు. స్థానిక చిత్తిరి వీధిలో చిన్మయి మిషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 230 మందికి మెడికవర్ ఆస్పత్రికి చెందిన వైద్యులు కె.ప్రభు, వినయ్ వైద్య పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులు అందించారు. పరమాత్మానంద సరస్వతి మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్‌పర్సన్ పి.ఉమ, ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాలరావు, స్థానిక ఎస్‌వీసీటీ ప్రతినిధులు రమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం: రోగులకు తనిఖీలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

75 మందికి నేత్ర పరీక్షలు

సారవకోట: మండలంలోని బుడితి గ్రామంలో గురువారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 75 మందికి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు నిఖిత, సురేష్, ప్రభుత్వ వైద్యుడు ప్రతాప్ వైద్య పరీక్షలు చేపట్టారు. వీరిలో 40 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ సి.హెచ్.అశ్విన్ కుమార్ తెలిపారు.

76 మందికి..

హిరమండలం: హిరమండలం సచివాలయం-3లో శ్రీకాకుళం పట్టణానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలోఉచిత నేత్ర వైద్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. 76 మందికి వైద్య సహాయకులు శివకుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 32 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసేందుకు ఆస్పత్రికి తరలించారు. అవసరమైనవారికి మందులు, కళ్లద్దాలు అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు, నిర్వాహకుడు టి.రామారావు, నాయకులు యాళ్ల నాగేశ్వరరావు, పి.శ్రీధర్, దారపు ఢిల్లేశ్వరరావు, బర్రి సురేష్, గోళ్ల సింహాచలం, పి.సంతోష్ పాల్గొన్నారు.



నరసన్నపేట: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



సారవకోట: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉపాధ్యాయులను వెనక్కి తీసుకురావాలి

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని 14వ వార్డు ఐ.జె.నాయుడు కాలనీలో గల చిన్నికృష్ణాపురం మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను వెంటనే వెనక్కి తీసుకురావాలని ఎంఈఓ జి.రాజేంద్ర ప్రసాద్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఎంఈఓ గురువారం పాఠశాల సందర్శనకు వెళ్లారు. విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడకు చేరుకున్నారు. ఇక్కడి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు పంపించారన్నారు. పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి 75 మంది విద్యార్థులున్నారన్నారు. ఏడుగురు ఉపాధ్యాయులుంటే గత ఏడాది డిప్యూటేషన్ పేరుతో ముగ్గురిని ఇక్కడి నుంచి పంపించేశారన్నారు. వారి స్థానంలో కొత్తగా మరో ముగ్గురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇక్కడకు పంపించారని తెలిపారు. ఈ నెల 13వ తేదీన పాఠశాలల పునఃప్రారంభమైన వెంటనే ఇక్కడికి డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులను రిలీవ్ చేశారన్నారు. ఈ పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులను వెనక్కి తీసుకురాలేదన్నారు. ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులలో ఓ ఉపాధ్యాయుడు క్యాజువల్ లీవ్ పెట్టారన్నారు. రెండు, మూడు తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి విద్యను బోధిస్తున్నారన్నారు. విద్యార్థులకు పాఠాలు అర్థంకాక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటేషన్‌పై వెళ్లి ఉపాధ్యాయులను మరో వారం రోజుల్లో పాఠశాలకు తిరిగి వచ్చేలా చర్యలు తీసుకుంటానని ఎంఈఓ హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు శాంతించారు.

రోడ్డు నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు



మంత్రిని కలిసిన కూన రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస-శ్రీకాకుళం సీఎస్పీ రహదారి నిర్మాణం పూర్తి చేసేందుకు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ చర్యలు చేపట్టారు. అమరావతిలో రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎస్పీ రహదారి పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రహదారి పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించినట్లు సమాచారం.

షోరూమ్ తొలగించాలని హైకోర్టు ఉత్వర్వులు

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయం సమీపంలో గల టెక్కలి రోడ్డుకు అనుకుని ఉన్న ఓ షోరూమ్ భవన నిర్మాణాన్ని తొలగించేందుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని పంచాయతీ ఈఓ టి.కూర్మారావు గురువారం తెలిపారు. నీమణిదుర్గ కాలనీ-3వ లైన్‌కు రహదారి కోసం రుగడ లక్ష్మీనారాయణ హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడంతో ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. టీవీఎస్ షోరూమ్ యాజమాని రాజుకుమారి పాణిగ్రాహికి ఐదుసార్లు నోటీసులు అందించామన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి చర్యలు తీసుకుంటామని ఈఓ తెలిపారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార లాభాపేక్షతో కొందరు వ్యక్తులు వేసిన అనధికార లేఅవుట్లపై ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రవి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు మెట్టెక్కివలస సర్వే నంబర్ 147లో అనధికారికంగా లేఅవుట్ వేశారన్నారు. ఈ లే అవుట్‌కు మున్సిపల్, సుడా నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదన్నారు. ఇటువంటి అనాధికార లేఅవుట్‌లో క్రయవిక్రయాలు చేపడితే మున్సిపల్ చట్ట నిబంధనల మేరకు కూల్చివేతలు చేపట్టడం జరుగుతుందన్నారు.

25న మండల సమావేశం

పాతపట్నం: ఈ నెల 25వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కె.రామకృష్ణ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీపీ దోర సావిత్రమ్మ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. మండల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.